సాక్షి మహబూబాబాద్

ఆదివారం । 27 । ఆగస్టు । 2023



ఓటు వజ్రాయుధం

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిది. అలాంటి ఓటు హక్కు పొందే అవకాశం 18 ఏళ్లు నిండిన వారందరికీ మన రాజ్యాంగం కల్పించింది. - 8లో▸



గిరిజనుల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్ర

గిరిజనుల మధ్య చిచ్చు పెట్టేందుకే రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తూ వారిని అయోమయానికి గురి చేస్తున్నాడని రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.9°/24.8°

జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండతీవ్రత ఉంటుంది. పలుచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రజల గుండెల్లో చెరగని ముద్ర.. గద్దర్

- సీపీఎం మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ సోమయ్య



నెహ్రూసెంటర్: ప్రజాయుద్ధ నౌక, విప్లవోద్యమ నాయకుడు గద్దర్ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర అని సీపీఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య అన్నారు. కవి, రచయిత కొమిరే వెంకన్న రాసిన 'పాటల తొలిపొద్దు గద్దరన్న స్మృతిగీతం' సీడీ ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా కేంద్రలలోని సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ.. గద్దర్ తన పాటలు, రచనల ద్వారా ప్రజల్ని మేల్కొపడాని తెలిపారు. త్వరలో మానుకోట జిల్లాలో గద్దర్ సభను నిర్వహించనున్నట్లు వెంకన్న చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ డోలి సత్యనారాయణ, గుగ్గిళ్ల పీరయ్య, మైస శ్రీనివాస్, పిల్లి సుధాకర్, బాబన్న, హెచ్.లింగ్యా, దేవేందర్, శ్రీపాల్‌రెడ్డి, గుండెల రాజు, ఉప్పలయ్య, దర్శనం రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మానుకోట ఆడబిడ్డకు అరుదైన గౌరవం



మహబూబాబాద్ రూరల్: మానుకోట జిల్లా ఆడబిడ్డకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అరుదైన గౌరవం కల్పించింది. తెలుగువారి ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుమల తిరుపతి దేవస్థానముల బోర్డు పాలక మండలి సభ్యురాలిగా జిల్లాలోని నర్సింహులపేట మండలం జయపురం గ్రామానికి చెందిన నెలకుర్తి సంజీవరెడ్డి కుమార్తె గాదె సీతారంజిత్‌రెడ్డికి అవకాశం కల్పించారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. సీతకు గాదె రంజిత్‌రెడ్డితో వివాహ అనంతరం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. జూబ్లిహిల్స్ వెంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించి సీత నియామకంపై ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, మున్సిపల్ చైర్మెన్ డాక్టర్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, నెలకుర్తి కృష్ణారెడ్డి, సత్తిరెడ్డి, జయపురం గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

మునిగలవీడు పాఠశాలలో డీఈఓ విచారణ



నెల్లికుదురు: మండలంలోని మునిగలవీడు ప్రాథమిక పాఠశాలలో శనివారం డీఈఓ రామారావు విచారణ చేపట్టి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సక్రమంగా పాఠశాలకు రాకుండా ఎగనామం పెట్టి ప్రైవేట్ టీచర్లతో పిల్లలకు బోధన కొనసాగిస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదుతో విచారణ చేపట్టినట్లు తెలిపారు. ఉపాధ్యాయులు తమ హక్కుల కోసం పోరాడుతున్నట్లు పిల్లల చదువుపై శ్రద్ధ వహించాలని, నిర్లక్ష్యం చేస్తే శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై వివరాలను అడిగి తెలుసుకున్నారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించనున్నట్లు డీఈఓ తెలిపారు. డీఈఓ వెంట ఎంఈఓ రామారావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

మొక్కలునాటి పర్యావరణాన్ని రక్షించాలి

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్



మహబూబాబాద్ రూరల్: పర్యావరణ పరిరక్షణకు, భావితరాల మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని న్యాయస్థానముల భవన సముదాయం ప్రాంగణం ఆవరణలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్, సీనియర్ సివిల్ జడ్జి సురేష్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మౌనిక, అదనపు జూనియర్ సివిల్ జడ్జి తిరుపతి, తొర్రూరు జూనియర్ సివిల్ జడ్జి సరిత శనివారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చంద్రశేఖరప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి జ్యోతిబాబు పాల్గొన్నారు.

నవదాడేరి తీజ్

సంప్రదాయబద్ధంగా గిరిజన యువతుల వేడుక

సండే స్పెషల్

- తొమ్మిది రోజులు భక్తిశ్రద్ధలతో గోధుమనారుకు పూజలు
- నియమ, నిష్టలు, ఆటపాటలతో సందడే సందడి
- చివరి రోజు కుంటలు, చెరువుల్లో నిమజ్జనం
- ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక కమిటీల ఏర్పాటు

లాంబి లాంబి లాంబడీ ఎకేరీయో (గునుగు పూల వలే ఎదగవమ్మా) అంటూ తొమ్మిది రోజుల సంబురం.. కఠోర నియమాలు.. దప్పుల మోతలు.. తండావాసుల కేరింతలు.. పెళ్లికాని ఆడబిడ్డల ఆటపాటలు.. అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల అనుబంధాలు.. భక్తిభావం వీటి మేళవింపే తొమ్మిది రోజుల (నవదాడేరి తీజ్) పండుగ. ఆషాఢం, శ్రావణ మాసంలో బంజారాలు తీజ్ వేడుకలను తమ సంస్కృతిని ప్రతిబింబించేలా జరుపుకుంటారు. ప్రస్తుతం ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా ఈ పండుగ నిర్వహిస్తున్నారు. కాలనీలు, తండాల్లో తీజ్ సందడి నెలకొంది. బతుకమ్మ పండుగను పోలి ఉండే తీజ్ వేడుకలపై ఈ వారం సండే స్పెషల్.





గోధుమ బుట్టలతో యువతులు



వరంగల్ రంగశాయిపేటలో ఇటీవల జరిగిన తీజ్ వేడుకల్లో యువతులు, మహిళలు

(వరంగల్ డెస్క్)

సేవాలాల్ మహరాజ్, మేరామా తల్లికి పూజలు చేసే క్రమంలో ఈ తీజ్ వేడుకలను నిర్వహిస్తారు. పెళ్లి కాని యువతులు తమకు మంచి వరుడు లభించాలని, తండావాసులు తమ పాడి పశువులు, పిల్లా పాపలు చల్లగా ఉండాలని వేడుకుంటూ తొమ్మిది రోజులపాటు తీజ్ పండుగను జరుపుకుంటారు. గతంలో తండాల్లో జరిగే ఈ వేడుకలు ఇప్పుడు నగరాలు, పట్టణాలకు విస్తరించాయి. గ్రేటర్ వరంగల్, మహబూబాబాద్, జనగామ పట్టణాల్లోని పలు కాలనీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసి సంప్రదాయబద్ధంగా ఉత్సవాలను జరుపుకుంటున్నారు.

నిర్వహణకు కమిటీలు

తొమ్మిది రోజులపాటు ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేసుకుంటున్నారు. ఖర్చుతోపాటు ఇతర వ్యవహారాలను చూసుకోవడం.. కమ్యూనిటీని ఏకతాటిపైకి తేవడం కోసం ఐదుగురునుంచి పది మంది కలిసి కమిటీ ఏర్పాటు చేసుకుంటున్నారు. ఉత్సవం మొదటి నుంచి చివరి రోజు వరకు కార్యక్రమాల నిర్వహణ.. ఆటపాటలు, డీజే, లైటింగ్, అతిథులను పిలవడం వరకు కమిటీనే చూసుకుంటుంది.



భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తాం..



తొమ్మిది రోజుల పండుగ తీజ్. ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో తీజ్ బుట్టలో నీరు పోస్తూ పాటలు పాడుతాం. తీజ్ ఎదుగుదలకు సేవాలాల్ మహరాజ్, మేరామా యాడిని భక్తి శ్రద్ధలతో పూజిస్తాం. ఈ వేడుకల్లో ఢమోళీ కార్యక్రమం ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటాం. చివరి రోజు తీజ్ నిమజ్జనం వేళ ఆటపాటలతో సందడిగా ఉంటుంది.

- గుగులోత్ దివ్యజ్యోతి, వరంగల్

మంచి భర్త రావాలని..



మంచి భర్త రావాలని సేవాలాల్ మహరాజ్, మేరామా యాడీలను నిష్టతో పూజించి తీజ్ పండుగ నిర్వహిస్తాం. పాడి పశువులు, పంటలు బాగుండాలని సేవాలాల్‌ను పూజిస్తాం. చివరి రోజు తీజ్ మమ్మల్ని వదిలి పోతుందని బాధతో పాటలు పాడుతూ చెరువుల్లో నిమజ్జనం చేస్తాం.

- బానోతు నిహారిక, గోపాలపురం, హనుమకొండ

గిరిజన సంస్కృతికి ప్రతీక తీజ్



గిరిజన సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక తీజ్. ప్రతి ఏడాది మాకు ఇది పెద్ద పండుగ. పెళ్లి కాని యువతులు ఉపవాసం ఉండడం తీజ్ ప్రత్యేకత. మొదటి రోజునుంచి ఉత్సవాలు ముగిసే వరకు ఒకే పూట భోజనం చేస్తాం. ఎటువంటి మసాలాలు తినం. ఆకు కూరలు, జొన్నెరొట్టెనే.

- భూక్య సబిత, గుండ్లసింగారం

తొమ్మిది రోజులు ఉపవాసమే..



తీజ్ పండుగ ప్రారంభం నుంచి కఠోర నియమాలు పాటిస్తాం. గోధుమ నారును కంటికి రెప్పలా కాపాడుతూ.. ఉపవాసం ఉంటాం. రోజులో ఒక పూట భోజనం అది కూడా జొన్నరొట్టె, ఆకు కూర మాత్రమే. చివరి రోజు తీజ్ నిమజ్జనం చేసినప్పుడు దుఃఖం కలుగుతుంది. తీజ్ మమ్మల్ని వదిలి పోతుందని బాధతో పాటలు పాడుతూ చెరువుల్లో నిమజ్జనం చేస్తాం.

- ఇస్లావత్ అంజలి బాయి, వరంగల్

తొమ్మిది రోజులు ఇలా..

ఈ తీజ్ వేడుకల్లో మొదటి రోజు తండావాసులు గుమిగూడి తండా పెద్దమనిషి ఇంటి వద్ద సాయంత్రం వేళ గోధుమలు, శనగలు, నవధాన్యాలను నానబెడతారు. రెండో రోజు నానబెట్టిన గోధుమలను చిన్న చిన్న బుట్టల్లో (దుస్సేరు తీగతో అల్లినవి) మట్టి, సేంద్రియ ఎరువు అలికిన తర్వాత పాటలు పాడుతూ బుట్టల్లో గోధుమలు విత్తుతారు. మూడో రోజు ఉదయం మంచె(ఢాక్లో) ఏర్పాటు చేసి గోధుమ చల్లిన బుట్టలను మంచెపై పెడతారు. అనంతరం పెళ్లి కాని అమ్మాయిలు తొమ్మిది రోజులపాటు రోజూ పాటలు పాడుతూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం తీజ్ బుట్టల్లో నీరు పోస్తారు. ఈ తొమ్మిది రోజుల పాటు వీరి ఆహారం ప్రత్యేకంగా ఉంటుంది. ఉప్పు, కారం, మసాలాతో తయారు చేసిన ఆహారాన్ని ఎట్టి పరిస్థితుల్లో భుజించరు. నియమ నిష్టలతో ఉంటూ ఆకు కూరలు, జొన్నరొట్టెలు తింటూ తీజ్‌ను (గోధుమ నారును) కాపాడుకుంటారు. తీజ్ పండుగను సేవాలాల్ మహరాజ్, దండి మేరమా దేవతనే జరిపిస్తుందని గిరిజనుల విశ్వాసం. ఏడో రోజు ఢమోళీ పూజ ఘనంగా జరుపుకుంటారు. తొక్కుడు పడని నల్లమట్టి తెచ్చి (అబ్బాయి, అమ్మాయి ప్రతిమలు) బొమ్మలు తయారు చేస్తారు. వీటిని గణగోర్ అని పిలుస్తారు. ఈ సందర్భంగా బియ్యం పిండితో చేసిన రొట్టెల్లో బెల్లం కలిపి నైవేద్యం (చూర్మో) తయారు చేస్తారు. అనంతరం డప్పు చప్పుళ్లతో ప్రతి ఇంటికి వెళ్లి చూర్మో పంచుతూ నృత్యాలు చేస్తారు. రాత్రి సమయంలో అందరూ తీజ్ మంచె దగ్గర కలుసుకొని పాటలు పాడుతూ అమ్మాయిల చేత నెయ్యి, బెల్లం అన్నం కలిపి(దప్కార్) ఇస్తారు. చివరగా గణగోర్ బొమ్మలను తీజ్ వద్ద పెట్టి పూజలు నిర్వహిస్తారు. చివరి రోజు తీజ్ నిమజ్జన కార్యక్రమంలో భాగంగా తండావాసులందరూ కలిసి సేవాలాల్ మహరాజ్‌కు బెల్లం అన్నం (కడవో) నైవేద్యంగా పెడతారు. మేరమా యాడికి ప్రత్యేక పూజలు చేస్తారు. సాయంత్రం వేళ మంచె ఢాక్లో పైనుంచి తీజ్ బుట్టలను అమ్మాయిలు తీసుకుని బాధాతప్త హృదయంతో తీజ్ తమను వదిలి వెళ్తోందని ఆటపాటలతో దగ్గరలోని కుంటలు, చెరువుల్లో బుట్టలను నిమజ్జనం చేస్తారు. ఈ సందర్భంగా అన్నదమ్ములు తమ అక్కాచెల్లెళ్ల కాళ్లు కడిగి ఆశీర్వాదం తీసుకుంటారు.



మొదటి రోజు గోధుమలు, మట్టికి పూజ...

ఓటు హక్కు విశిష్టతను తెలియజేయాలి

- కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: 18 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు విశిష్టతను తెలియచేసి ఓటరుగా నమోదు చేయాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఓటు హక్కు తదితర అంశాలపై కలెక్టర్ ఎన్నికల విభాగం అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యాసరచన పోటీలు నిర్వహించాలన్నారు. జిల్లా యువజన క్రీడల అధికారి సహకారంతో 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే నెల 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తారని ఈ సందర్భంగా సభను వినియోగించుకుని స్వీప్ కార్యకపాల గురించి తెలియజేయాలన్నారు. సెప్టెంబర్ 23న జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో దివ్యాంగులతో వినూత్న కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ డేవిడ్, అధికారులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శించాలి

ఓటర్ల జాబితాను పోలింగ్ కేంద్రాల్లో ప్రదర్శించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఓటర్ల జాబితాపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా వికాస్‌రాజ్ మాట్లాడుతూ ఓటు హక్కు నమోదు పెంచాలన్నారు. కలెక్టర్ శశాంక మాట్లాడుతూ.. జిల్లాలో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బీఎల్‌ఓలకు ఓటర్ల జబితాపై పూర్తి అవగాహన కోసం శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ డేవిడ్, అధికారులు పాల్గొన్నారు.

కేసీఆర్‌కు బుద్ధి చెప్పే పార్టీ బీజేపీ

- ఈటల రాజేందర్

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌కు బుద్ధి చెప్పే సత్తా ఉన్న పార్టీ బీజేపీ ఒక్కటేనని ఆపార్టీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశానికి రాజేందర్ మాట్లాడారు. మానుకోటలో బీజేపీకి కనీ వినీ ఎరగని రీతిలో స్పందన ఉందని అన్నారు. ఒక ఎమ్మెల్సీ మాట్లాడుతూ కుక్కల్లెక్క మొరుగకుండా ఉండాలంటే బీఆర్‌ఎస్‌లో పడేస్తే చాలు అని వారిని చేర్చుకున్నామన్నారని, దీనిని బట్టి బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు ఆలోచన చేసుకోవాలని హితవుపలికారు. కాంగ్రెస్ వాళ్లను గెలిపిస్తే మళ్లీ బీఆర్‌ఎస్‌లోకి పోరు అనే నమ్మకం ఎంటని ప్రశ్నించారు. కేసీఆర్‌కు ప్రజలు ఓటు వేసే అవకాశం లేదని, ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. డబ్బు బలంతో మీడియాను మేనేజ్ చేసి, అదర గొట్టి ప్రభుత్వాన్ని నడుపుతున్నారని ఆరోపించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలు వేరే పార్టీలోకి పోతారని భయపడి వాళ్లను కంట్రోల్‌లో పెట్టుకోడానికి సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ అభ్యర్థుల జాబితా విడుదల చేశారన్నారు. రాష్ట్రంలో 11 శాతం ఉన్న మాదిగలకు ఒక్క మంత్రి పదవి ఇవ్వకుండా అవమానపరిచారని అన్నారు. బీసీలు 52 శాతం ఉంటే 23 సీట్లు ఇచ్చారని, ముదిరాజ్, కురుమ, నాయిబ్రహ్మణ, రజక, కుమ్మర, ఎంబీసీలకు ఒక్క సీటు లేదని పేర్కొన్నారు. బండి సంజయ్ మూడు సంవత్సరాలు అధ్యక్షుడిగా పార్టీని బలోపేతం చేశారని అన్నారు. బీఆర్‌ఎస్‌లాగా జీవితాంతం ఒకరే అధ్యక్షుడు ఉండరని, చచ్చిపోయే దాకా అధ్యక్షుడు, వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి వారి కుటుంబం నుంచే ఉంటారని ఎద్దేవా చేశారు. టికెట్‌ల కసరత్తు చేస్తున్నామని త్వరలో మొదటి లిస్ట్ ప్రకటిస్తామని, తెలంగాణకు ప్రత్యేక మేనిఫెస్టో ఉంటుందన్నారు. నేడు ఖమ్మంలో జరగనున్న రైతు సదస్సును విజయవంతం చేయాలని కోరారు. గోవా రాష్ట్రం వాస్కోడిగామా ఎమ్మెల్యే కృష్ణ సాల్కర్, గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జాటోత్ హుస్సేన్ నాయక్, జిల్లా అధ్యక్షుడు వద్దిరాజు రామచందర్ రావు, శ్రీవర్ధన్‌రెడ్డి, రాజవర్ధన్‌రెడ్డి, సీతయ్య, ఎల్ది మల్లయ్య, శశివర్ధన్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, నవీన్ నాయుడు, ఆకుల శ్రీనివాస్, రేష్మా, ఇందు, వెంకటేశ్వర్లు, సందీప్, సంపత్, సిద్దార్థరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

'మ్రాను'కోటగా మారుద్దాం..

- కలెక్టర్ శశాంక

గూడూరు: మానుకోట జిల్లాను మ్రానుకోట (చెట్లకోట)గా మారుద్దామని కలెక్టర్ శశాంక అన్నారు. గూడూరు మండలం జగన్నాయకులగూడెం శివారు గండితండా ఫారెస్టు ప్లాంటేషన్‌లో శనివారం కోటి వృక్షార్చన కార్యక్రమంలో కలెక్టర్ శశాంక, ఎమ్మెల్యే శంకర్‌నాయక్, డీఎఫ్ఓ రవి కిరణ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ శశాంక మాట్లాడారు. పచ్చని చెట్లతో కూడిన అటవీ సంపద, పర్యావరణ పరిరక్షణ మానవాళి మనుగడకు ఆధారమని అన్నారు. హరితహారం కార్యక్రమంలో అడవులు అభివృద్ధి చెందాయని తెలిపారు. ప్రతీ కుటుంబం మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ బానోతు సుజాత, జెడ్పీ కోఆప్షన్ ఖాసీం, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎఫ్ఆర్వో సురేష్ పాల్గొన్నారు.



జగన్నాయకులగూడెం గండితండా ప్లాంటేషన్‌లో మొక్క నాటుతున్న కలెక్టర్

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

మహబూబాబాద్ అర్బన్: సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని యూఎస్‌పీసీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు టి.లింగారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో లింగారెడ్డి మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులపై రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ, సమస్యల పరిష్కారానికి ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ సెప్టెంబరు 1న హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టనున్న మహాధర్నాను జయప్రదం చేయాలన్నారు. రెండో వేతన సవరణ కమిషన్‌ను ఏర్పాటు చేసి, కమిషన్ సిఫార్సులు వచ్చేంతవరకు మధ్యంతర భృతి(ఐఆర్) చెల్లించి, ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, హెల్త్ కార్డులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం యూఎస్పీసీ రాష్ట్ర బాధ్యులు మల్లారెడ్డి, చాప బాబు మాట్లాడారు. శ్రీశైలం, భాస్కర్, కృష్ణమూర్తి, యాకూబ్, ప్రభాకర్, ఉపేందర్, విద్యాసాగర్, విజయకుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లింగారెడ్డి

అనాథ బాలల సంరక్షణకే బాలసదన్



నాయనమ్మతో మాట్లాడుతున్న బాలిక

చిన్నగూడూరు: అనాథ బాలల సంరక్షణకు బాలసదన్ తోడ్పడుతుందని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి అన్నారు. మండల కేంద్రానికి చెందిన బాలిక పిల్లి ఝాన్సీ తల్లి చిన్నప్పుడే మరణించడంతో తండ్రి మరొక వివాహం చేసుకుని వెళ్లిపోయాడు. అనాథగా మారిన బాలికను బాలల సంరక్షణ అధికారులు చేరదీసి హైదరాబాద్‌లోని బాల సదన్‌కు తరలించారు. ఝాన్సీ ప్రస్తుతం ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ చదువుతుంది. ఝాన్సీ ప్రస్తుతం మేజర్ కావడంతో బాలల సంరక్షణ అధికారులు శనివారం మండల కేంద్రంలోని తమ బంధువులకు అప్పజెప్పేందుకు తీసుకొచ్చారు. ఇంటిదగ్గర నానమ్మ వృద్ధాప్యంలో ఉండడంతో బాలిక సంరక్షణను నిరాకరించడంతో అధికారులు మరలా బాలల సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్లారు. బాలల హక్కులను పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని చైర్‌పర్సన్ నాగవాణి కోరారు. కార్యక్రమంలో సీడబ్ల్యూసీ కమిటీ మెంబర్ డేవిడ్, ప్రొటెక్షన్ ఆఫీసర్స్ వీరన్న, నరేష్, కౌన్సిలింగ్ అధికారి రమేష్, చైల్డ్ వెల్ఫేర్ ఆఫీసర్ సుగుణ తదితరులు ఉన్నారు.

రికార్డుల నిర్వహణపై ప్రశంస

దోర్నకల్: మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డుల నిర్వహణ బాగుందంటూ అదనపు కలెక్టర్ డేవిడ్ ప్రశంసించారు. మండలంలోని గొల్లచర్ల, పాతదుబ్బతండా, హూన్యాతండా, లింబ్యాతండా, కస్నాతండా, చాప్లాతండా, ఫకీరాతండా తదితర గ్రామాల్లో అదనపు కలెక్టర్ శనివారం పర్యటించి పల్లెప్రకృతి వనాలు, వర్మీ కంపోస్ట్ యార్డు, నర్సరీలు పరిశీలించారు. అనంతరం జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నిర్వహిస్తున్న రికార్డులను పరిశీలించారు. పలు గ్రామాల్లో మొక్కలు నాటారు. చాప్లాతండా పంచాయతీ కార్యాలయంలో రికార్డుల నిర్వహణ బాగుందని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఛత్రునాయక్, సర్పంచులు బానోత్ పాండునాయక్, చేరెడ్డి సమ్మిరెడ్డి, దేవిశంకర్‌నాయక్, బానోత్ రాంబాయి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన అదనపు కలెక్టర్

బయ్యారం: మండలంలోని నామాలపాడు ఏకలవ్య మోడల్ పాఠశాలలో అదనపు కలెక్టర్ డేవిడ్ మొక్కలు నాటారు. స్వాతంత్ర వజ్రోత్సవాల్లో ముగింపు సందర్భంగా కోటి మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 100 మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గణేష్, ఎంపీడీఓ చలపతిరావు, నామాలపాడు, కొత్తపేట సర్పంచులు కిరణ్, మమత, పాఠశాల ప్రిన్సిపాల్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.



చాప్లాతండాలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

సారా స్థావరంపై పోలీసు దాడులు

- 300 లీటర్ల బెల్లం పానకం, 8 లీటర్ల సారా ధ్వంసం

గార్ల: మండలంలోని బుద్దారం గ్రామంలో కాపుసారా స్థావరంపై దాడులు చేసి 300 లీటర్ల బెల్లం పానకం, 8 లీటర్ల కాపుసారాను ధ్వంసం చేసినట్లు ఎస్సై బానోత్ వెంకన్న తెలిపారు. బుద్దారం గ్రామానికి చెందిన భూక్యా బద్రి కొంతకాలంగా ఇంట్లో కాపుసారాయిని కాచి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి బెల్లంపానకం, కాపుసారాను స్వాధీనం చేసుకున్నారు. బద్రిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దాడుల్లో కానిస్టేబుళ్లు మంగీలాల్, శ్రీను, కిషన్ పాల్గొన్నారు.



బెల్లంపానకం ధ్వంసం చేస్తున్న పోలీసులు

క్లుప్తంగా

సీపీఎస్ రద్దుకు మహాధర్నా



కేయూ క్యాంపస్: సీపీఎస్ రద్దుకోసం హైదరాబాద్‌లో సెప్టెంబర్ 1న ఇందిరా పార్కు వద్ద నిర్వహించబోయే ఉద్యోగులు, ఉపాధ్యాయుల మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాముక కమలాకర్ పిలుపునిచ్చారు. కాకతీయ యూనివర్సిటీలోని గెస్ట్‌హౌస్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కేయూలోని సీపీఎస్ ఉద్యోగ సంఘాల బాధ్యులు తాటి దామోదర్, చిరంజీవి, రవికుమార్, మెట్టు రవి, అక్రమ్, సలీం, ఆనందం, ఐలయ్య, సలీంపాషా, మొగిలి, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మగౌరవ సభ

కేయూ క్యాంపస్ : తెలంగాణ రాష్ట్ర ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ కమిటీ వరంగల్ వేదికగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి ఆత్మగౌరవ సభను ఈనెల 27న హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాలలోని ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మూడేళ్ల కాలపరిమితి పూర్తయిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. మూడేళ్లకాలపరిమితి లోపు ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఏజెన్సీలను రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనాలను చెల్లించాలన్నారు. మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ.5 లక్షల ఆర్థికసాయం అందించాలన్నారు. కొత్త పీఆర్‌సీని జులై 2023 నుంచి అమలు చేయాలనే డిమాండ్లతో ఆత్మగౌరవ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు.



ఓటు.. వజ్రాయుధం

ఓటరుగా నమోదుకు యువత ముందుకు రావాలి

- పోలింగ్ బూత్‌ల్లో ప్రారంభం
- అందుబాటులో బీఎల్‌ఓలు

ఖిలా వరంగల్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, అలాంటి ఓటు హక్కు పొందే అవకాశం 18 ఏళ్లు నిండిన వారందరికీ మన రాజ్యాంగం కల్పించింది. ఎన్నికల కమిషన్ అధి కారులు ప్రత్యేకంగా యువతను ఓటర్లుగా నమోదు చేసుకునేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించారు. ముసాయిదా ప్రకారం శని, ఆదివారంతో పాటు సెప్టెంబర్ 2, 3 తేదీల్లో బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారు.

ఓటు దేశ గతిని మార్చే శక్తి ఉంది. వ్యవస్థ మార్పునకు నాంది పలుకుతుంది. ఓటు ప్రాముఖ్యతను వివరిస్తూ వరంగల్ ఉమ్మడి జిల్లాలో ఈనెల 21న ముసాయిదా జాబితా వెల్లడించారు. ఈనెల 26 నుంచే ఉమ్మడి జిల్లాలో ఓటు ఉందో లేదో చూసుకునే అవకాశాన్ని ఆయా జిల్లా అధికారులు అవకాశాన్ని కల్పించారు. పోలింగ్ బూతుల్లో శనివారం ఆదివారాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు బూత్ లెవల్ అధికారులు ఓటరు జాబితాలతో పాటు అందుబాటులో ఉంటారు.

నమోదు, సవరణలు ప్రారంభం

ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులు చేసుకునేందుకు జిల్లా యంత్రాంగం ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటి వరకు ఓటరు జాబితా ప్రత్యేక సవరణ శనివారం నుంచి ప్రత్యేకంగా చేపట్టినట్లు అధికారులు ప్రకటించారు. 2023 అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కుకు అర్హులే. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల అధికారులు ఈ విషయంలో ఆర్‌ఓలకు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. మీ ప్రాంతాల్లోని బూత్ లెవల్ అధికారులు చేపట్టే ప్రత్యేక డ్రైవ్‌లో ఓటు నమోదు చేసుకోవాలని కోరారు.

ఓటు నమోదు ఇలా..

ఓటు హక్కు లేనివారు పాస్‌ఫోర్టు సైజు ఫొటో, నివాసం, వయసుకు సంబంధించిన మండల అధికారి జారీ చేసిన ధ్రువీకరణ పత్రం, పదో తరగతి మెమో, రేషన్‌కార్డు, ఇంటి పన్ను రశీదు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్‌కార్డు తదితర వాటిలో ఏదైనా ఒకటి ఫారం–6కు జత చేసి అందజేస్తే ఓటు హక్కు పొందవచ్చు.

యాప్‌లో ఓటరు నమోదు..

బీఎల్‌ఓ వద్దకు వెళ్లలేని వారు..వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోలేని పరిస్థితుల్లో మీ వద్ద ఉన్న మొబైల్‌లో (ఓటర్ హెల్ప్‌లైన్ మొబైల్ యాప్)ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. దానిపై క్లిక్ చేయగానే పోర్టల్ ఓపెన్ అవుతుంది.



వరంగల్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో ఓటరు నమోదును పరిశీలిస్తున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

ఈనెల 21న విడుదల చేసిన ముసాయిదా జాబితా ప్రకారం ఓటర్లు..

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ట్రాన్స్‌జెండర్స్	టీజీ సర్వీస్
జనగామ	1,11,270	1,11,211	11	34
స్టేషన్‌ఘన్‌పూర్	1,18,168	1,18,825	1	164
పాలకుర్తి	1,19,432	1,18,311	7	141
డోర్నకల్	1,03,769	1,04,862	17	161
మహబూబాబాద్	1,18,611	1,20,092	31	179
నర్సంపేట	1,10,037	1,11,935	5	338
పరకాల	1,03,981	1,07,677	2	152
వరంగల్ పశ్చిమ	1,35,297	1,36,855	10	70
వరంగల్ తూర్పు	1,18,638	1,23,211	235	87
వర్ధన్నపేట	1,27,082	1,28,421	15	171
భూపాలపల్లి	1,32,118	1,31,330	4	167
ములుగు	1,04,795	1,07,257	16	210
మొత్తం	14,03,198	14,19,987	354	1874

ఓటరుగా నమోదు చేసుకోవాలి : కలెక్టర్ ప్రావీణ్య

అర్హులైన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. శనివారం వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని వరంగల్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన 121, 122, 123, 124 పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ రిజ్వాన్ బాషాలతో కలిసి సందర్శించారు. పోలింగ్ బూత్‌లో బీఎల్‌ఓలు చేస్తున్న ఓటరునమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు ఓటరుగా నమోదు చేసుకోని వారు పోలింగ్ బూత్ కేంద్రానికి వచ్చి ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటు ద్వారా నీతివంతులను, యోగ్యులైన నాయకులను ఎన్నుకునే అవకాశం రాజ్యాంగంలో లిఖింపబడిందన్నారు.

ఆన్‌లైన్‌లోనూ...

ప్రతి రాష్ట్రానికి ఒక ఓటరు గుర్తింపు ఇచ్చే వెబ్‌సైట్ ఉంటుంది. మన రాష్ట్రంలో హెచ్‌టీటీపీఎస్:///ఓటర్స్.ఈసీఐ.గౌట్.ఇన్) వెబ్ సైట్‌కు వెళ్లాలి. అందులో కొత్త ఓటరు రిజిస్ట్రేషన్ ఉంటుంది. ఆ లింక్ క్లిక్ చేయగానే ఫాం నంబర్ 6 వస్తోంది. ఆ దరఖాస్తు ఓపెన్ చేసి మీ పేరు, పుట్టిన తేదీ ఇతర వివరాలు నమోదు చేయాలి.



గుర్తింపు కార్డు పొందడం..

ఓటరు గుర్తింపు కార్డు కావాలనుకునే వారు (హెచ్‌టీటీపీఎస్:///ఓటర్స్.ఈసీఐ.గౌట్.ఇన్) వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. అందులో ఈ–ఎపిక్ కార్డు డౌన్ లోడ్ అని కనిపిస్తోంది. దానిపై క్లిక్ చేసి.. మీ మొబైల్, ఎపిక్ (గుర్తింపు) కార్డు నంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఫారం–8 ద్వారా ఫోన్ నంబర్ అనుసంధానం చేసుకోవచ్చు. ఆ తర్వాత గుర్తింపు కార్డును డౌన్ లోడ్ చేసుకోవచ్చు.

ముందే మేల్కొవాలి

పోలింగ్ రోజున బూత్‌లకు వెళ్లిన తర్వాత తమ ఓటు గల్లంతైందని బాధపడే కంటే ముందుగానే మేల్కొంటే మంచిదని అధికారులు సూచిస్తున్నారు. చాలా మంది ఓటరు జాబితాలో పేరు ఉందో.. లేదో చూసుకోవడం లేదు. కొందరైతే తమకు ఎన్నికల సంఘం జారీ చేసిన గుర్తింపు కార్డు ఉందని, దాంతో కచ్చితంగా తమ ఓటు జాబితాలో ఉంటుందని వాదిస్తున్నది మనం చూస్తునే ఉంటాం. కానీ ఓటర్ లిస్టులో పేరు ఉందా లేదా చూసుకునే అవకాశం ప్రస్తుతం కల్పించింది.

విద్యార్థిని డ్యాన్స్ అదుర్స్

- సోషల్ మీడియాలో వీడియో వైరల్



అంజలి

పాలకుర్తి టౌన్: టాలెంట్ ఉండాలే గానీ దాన్ని ఆపడం ఎవరి తరం కాదు..కాకపోతే కొంచెం ఆలస్యం కావొచ్చు. కానీ సోషల్ మీడియా పుణ్యమా అని ఎందరో ప్రతిభావంతులు త్వరగానే వెలుగులోకి వస్తున్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన ఓ బాలిక ప్రతిభ కనబర్చింది. ఓ పాటకు ఆమె చేసిన డ్యాన్స్‌కు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దాదాపు మూడు లక్షల మంది ఆమె వీడియోను వీక్షించారు. వివరాల్లోకి వెళ్తే.. మల్లంపల్లిలోని ప్రభుత్వ హైస్కూల్‌లో దాసుగూడెం తండాకు చెందిన కునుసోత్ అంజలి పదో తరగతి చదువుతోంది. గత ఫిబ్రవరిలో సదరు పాఠశాలలో బాలసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమంలో అప్పుడు 9వ తరగతి చదువుతున్న అంజలి 'కాలం నీతో నడవదు... నిన్ను అడిగి ముందుకు సాగదు' అనే పాటకు సూపర్ డ్యాన్స్ చేసింది. ఈ క్రమంలోనే ఆమె డ్యాన్స్‌కు సంబంధించిన వీడియోను గత మే 21న ఓ వ్యక్తి యూ ట్యూబ్‌లో అప్‌లోడ్ చేశాడు. దీంతో ఆ విద్యార్థి డ్యాన్స్ వీడియో వైరల్‌గా మారింది. ఇప్పటి వరకు ఆ వీడియోకు దాదాపు 3 లక్షల వ్యూస్ వచ్చాయి. అలాగే 10 వేల మంది వరకు లైక్ చేశారు. ఇప్పుడంతా ఆ విద్యార్థి డ్యాన్స్ గురించే మాట్లాడుతూ ఉండడం విశేషం. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కుల్లా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ అంజలి డ్యాన్స్‌లో ప్రతిభావంతురాలని, ప్రోత్సాహం అందిస్తే భవిష్యత్‌లో మంచి డ్యాన్సర్‌గా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



డాన్స్ చేస్తున్న అంజలి

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

OPEN ADMISSIONS

■Open 10th open Inter One Sitting admissions Last date 30-08-2023. Contact: Phone No: 7396135390. [W-189140]

REAL ESTATE

FLAT FOR SALE

■2&3 BHK Luxury Flats for Sale Behind Circuit House & Vikas Nagar Road No.11, Loan Facility Available. Cell: 7382332244, 7799320832. [WA-1002385]

HOUSE FOR SALE/RENT

■హన్మకొండ హంటర్ రోడ్ సమీపంలో 280 చ॥గ॥లో 3BHK ఇండిపెండెంట్ హౌజ్ అమ్మకానికి లేదా అద్దెకు ఇవ్వబడును. సెల్: 9949184625. [W-189153]

HOUSE FOR SALE

■ఉర్సుగుట్ట నుండి ఖాజీపేట్ వెళ్లు 150 ఫీట్ల రోడ్డు ప్రక్కన బట్టుపల్లి SR Prime School కు ఎదురుగా 2 & 3 BHK Independent Houses అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27211]

■మామునూర్‌లోని ఎత్తైన జాగాలో South / East కార్నర్ 390 చ॥గజాల్లో 1560 Sft నిర్మిత ఇంటికై సంప్రదించండి: సెల్: 9032111600. [W-189151]

■హన్మకొండ, పోస్టల్‌కాలనీలో 300 చ.గ.ల G+2 బిల్డింగ్ అమ్మకానికి కలదు. వెస్ట్ ఫేసింగ్, 100% వాస్తు గలది. సంప్ర: 9849283034. [W-785645]

FLATS FOR SALE

■KUDA కాలనీ 100 ఫీట్ల రోడ్డు, SPR School కు దగ్గరలో Stilt Plus 5 ఫ్లోర్స్ అపార్ట్‌మెంటులో 2 & 3 BHK Luxury Flats అమ్మకానికి కలవు. సెల్: 7660008666, 8309035091. [WA-27214]

FARM PLOTS FOR SALE

■ఆనందవనం ఫేస్ 7 నందు ఫామ్ ల్యాండు కొలన్‌పాక, యాదాద్రి నందు ఫామ్ ల్యాండు ఆఫర్ 5+1 ప్లాట్ నందు 5 తీసుకొన్న 1 ప్లాట్ ఫ్రీ Plot Rate 4999/-. సంప్ర॥ 9014743326. [W-189141]

PLOT FOR SALE

■ హన్మకొండ చౌరస్తా నుండి 2KM దూరంలో 300 గజాల ప్లాటు తూర్పు ఫేస్ కలది. ఒక రూమ్ కట్టి ప్లాటు చుట్టూ 5F గోడ గేట్ పెట్టినది. అమ్మకం గ॥ రూ॥ 23000/- ఫిక్స్‌డ్ నో బ్రోకర్స్. 9395561655. [W-785648]

PLOT DEVELOPMENT (OR) SALE

■ యూనివర్సిటీ మేన్‌రోడ్ మాత బార్ & రెస్టారెంట్ దగ్గరలో సుభాష్‌నగర్ లోని 2వ లేన్‌లో 40 వెడల్పు, 80 పొడుగు గల 355 Sq.Yds ప్లాటు డెవలప్‌మెంట్‌కి లేదా అమ్మకానికి కలదు. సంప్ర: 7095167309. [W-189132]

INDEPENDENT HOUSE

■HNK-Karimnagar Highway, Near Hasanparthy Independent Luxury House W/F 176 yards (28'9x55') KUDA Layout. Cont. : 99639 33629, 95504 80230 [M-10244]

SERVICES

■శ్రీరామ్ గోల్డ్: మీ బంగారం తాకట్టులో ఉందా? వడ్డీ చెల్లించలేకపోతున్నారా? తాకట్టు లో ఉన్న బంగారం విడిపించి ఈ రోజు మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్ : 9133214214. [H-788623]

CHANGE OF NAME

■I, THOUSI NIRMALA (Old Name) R/o. H.No. 2-3-61/11, Bus Stand Road, Mahabubabad Village, Mahabubabad Mandal, Mahabubabad District, T.S., have changed my name as TOUSI NIRMALA, W/o. VENKANNA (New Name) [W-189154]

■I, THOUSI VENKANNA (Old Name) R/o. H.No. 2-3-61/11, Bus Stand Road, Mahabubabad Village, Mahabubabad Mandal, Mahabubabad District, T.S., have changed my name as TOUSI VENKANNA, S/o. BHADRAIAH (New Name) [W-189155]

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■మీయొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు, సెల్: 9849145043. [W-189133]

BUSINESS OFFER

■ప్రతివ్యాపారవేత్త ఎదుగుదలకు గొప్ప అవకాశం మీ వ్యాపారాన్ని సులువుగా గుర్తింపు బ్రాండ్ పొందడానికి అనుకూలమైన అతి పెద్ద ప్లాట్ ఫారమ్ కొరకు సంప్ర. ఫోన్ : 8143614379. [HA-796936]

WANTED

■ Male Only Marketing Executives - For Ready Mix Concrete Any degree, Accountants - Any Degree with Tally, Site Supervisors - Diploma / B.Tech Civil with for all 2-4 years Experience Drop your Resume on WhatsApp and Contact No: 7330891166, 8555890439, 9849277408 [WA-13357]

■ Wanted Billing Executives, Front Office Executives, MBA Finance, Insurance Executives, Patient Coordinators, PRO's MBA Marketing for a reputed Hospital. Cont: 7337313271, 9949499959 [WA-13355]

■ భూపాలపల్లిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో పనిచేయుటకు అనుభవజ్ఞులైన (Experianced) నర్సింగ్ Staff కావలెను. సెల్: 8125926096. [W-1229351]

■ వరంగల్ స్టేషన్ రోడ్డు గల విష్ణు లాడ్జిలో పనిచేయుటకు రూమ్ బాయ్స్ కావలెను జీ॥ 8000/-లు మరియు మేనేజర్ ఒక్కరు జీ॥ 10000/-లు ఇవ్వబడును. సంప్ర॥ 9391864657. [W-189145]

■ రత్నశ్రీ ఫర్నీచర్ షాప్‌లో Good Looking Married / Unmarried అమ్మాయి కావలెను. 10AM-7.30PM, WGL D-Mart ప్రక్కన, WGL హాస్పిటల్ ఎదురుగా ఇంటర్వ్యూ - 28.8.23, సంప్ర॥ 8106683662. [W-189146]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

■ స్టార్ ఓల్డ్ ఏజ్ హోమ్/హోంకేర్ సర్వీస్ 24 గం॥ వృద్ధులను, పేషెంట్లను, చిన్న పిల్లలను చూసుకోవడానికి ఇంటి పని, వంట పనిచేయుటకు మీ ఇంటి వద్దకే వర్కర్లని ఫ్రీ. పురుషులను పంపించగలము సంప్ర॥ 8897730132, 8186926067. [W-1002386]

■ WGL, మండిబజార్ Exclusive డ్రైఫ్రూట్ షాప్‌లో సేల్స్ చేయుటకు ఆసక్తిగల యువతులు కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత. సాలరీ: 10000–12000. సెల్: 9177395934. [WA-602]

■ ఆఫీసులో పని చేయుటకు భార్యభర్తలు కావలెను. జీతం మరియు వసతి కల్పించబడును. మరిన్ని వివరాలకు సంప్ర: 9346997259, 7799007776. [W-1229456]

■ WGL, Experienced కార్ టెక్నీషియన్స్, హెల్పర్స్ కావలెను. సాలరీ: 20,000/– మా మోటార్స్ ములుగు X రోడ్ వరంగల్, సెల్: 9948434745, 9000687574. [WA-541]

■ షిర్డిసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పని చేయుటకు లేడీ వార్డెన్స్, ఆయాలు, వార్డ్‌బాయ్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్ : 9391036931, 9246585901 [HA-12052]

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. ఫోన్ : 9640258899, 9640468899 [HA-189323]

WANTED TEACHERS

■ Wanted Hindi and supporting Lady Teachers for 1st to 5th Classes Indian Kids High School, SVN Road, Warangal. Cont No: 9963006221. [W-189143]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9010144453
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

పురుగుల మందుతాగి ఒకరి ఆత్మహత్య

మహబూబాబాద్ రూరల్ : కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందాడని మహబూబాబాద్ రూరల్ రెండో ఎస్సై దండ కుమారస్వామి శనివారం తెలిపారు. మండలంలోని సికింద్రాబాద్ తండాకు చెందిన భూక్య నగేష్ (35)కు భార్య విజయ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నగేష్ ఏమి పని చేయకుండా ఖాళీగా ఉంటూ తిరుగుతున్నాడు. ఈ విషయంలో తరుచూ వారి కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో అతడు శుక్రవారం సాయంత్రం పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు నగేష్ ను చికిత్స నిమిత్తం మానుకోట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం వారికి అప్పగించారు.

కుటుంబ కలహాలతో మరొకరు..



వెంకన్న(ఫైల్)

తొర్రూరు రూరల్ : కుటుంబ కలహాలతో రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని సోమారపుకుంట తండాలో శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై రాంజీనాయక్ కథనం ప్రకారం.. సోమారపుకుంట తండాకు చెందిన బానోతు వెంకన్న(41) తనకున్న వ్యవసాయాన్ని చేసుకుంటూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఈక్రమంలో వ్యవసాయ పంట పెట్టుబడి, తన కుటుంబ అవసరాల కోసం లక్షల్లో అప్పులు చేయగా, అప్పులు ఇచ్చిన వారు తిరిగి అడగడంతో మనస్థాపానికి గురై తండా సమీపంలో ఉన్న దుర్గమ్మ ఆలయ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి వెంటనే తొర్రూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తొర్రూరులో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కాంగ్రెస్ నేత బక్క జడ్సన్ అరెస్ట్



జడ్సన్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు

హసన్‌పర్తి: కాంగ్రెస్ నేత బక్క జడ్సన్‌ను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రమేయంతోనే గోపాలపురం, భీమారం చెరువులు కబ్జాకు గురైనట్లు జడ్సన్ ఆరోపించారు. ఈక్రమంలో 26వ తేదీన ఆధారాలతో సహా నిరూపిస్తానని బీఆర్‌ఎస్ నాయకులకు ఆయన సవాల్ విసిరారు. ఆ సవాల్‌ను బీఆర్‌ఎస్ నేతలు కూడా స్వీకరించారు. ఈక్రమంలో శనివారం ఉదయం జడ్సన్‌తో పాటు పార్టీ నేతలు గోపాలపురం చెరువు వద్దకు బయల్దేరాడు. చర్చకు జడ్సన్ వస్తున్నారనే సమాచారం అందుకున్న స్థానిక కార్పొరేటర్ సిరంగి సునీల్ కుమార్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు మణీందర్‌నాథ్‌తో పాటు పలువురు నాయకులు అప్పటికే గోపాలపురం చెరువు వద్దకు చేరుకున్నారు. అయితే, శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందనే ఉద్దేశంతో జడ్సన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తులపై ఆయనను విడుదల చేశారు.

బీజేపీ సభను విజయవంతం చేయాలి



కాశిబుగ్గ: మాట్లాడుతున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కొండేటి శ్రీధర్

కాశిబుగ్గ: రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఖమ్మంలోని శ్రీరామ భక్త గెంటల నారాయణరావు(ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్) ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం జరగనున్న రైతు గోస.. బీజేపీ భరోసా మహాసభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ పిలుపునిచ్చారు. ఓసిటీలోని ప్రదీప్‌రావు క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మాయమాటలతో తెలంగాణ రైతాంగాన్ని మోసం చేస్తున్న సీఎం కేసీఆర్‌కు రాబోయే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారని అన్నారు. ఖమ్మంలో జరగనున్న సభకు ముఖ్యఅతిథిగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా హాజరు కానున్నారని వివరించారు. సమావేశంలో బీజేపీ నాయకులు సముద్రాల పరమేశ్వర్, బాకం హరిశంకర్, రఘునారెడ్డి, పాట్టి శ్రీనివాస్ గుప్తా, కనుకుంట్ల రంజిత్, గడల కుమార్, మార్టిన్ లూథర్, కందిమల్ల మహేష్, నాగరాజు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ షా సభను విజయవంతం చేయండి

నయీంనగర్: ఖమ్మం వేదికగా ఆదివారం జరగనున్న బీజేపీ తలపెట్టిన రైతు గోస – బీజేపీ భరోసా సభకు రైతులు, ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల రాకేష్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

గిరిజనుల మధ్య చిచ్చుపెట్టేందుకు కుట్ర



ఓపెన్‌కారులో వస్తున్న మంత్రి దయాకర్‌రావుకు స్వాగతం పలుకుతున్న బీఆర్‌ఎస్ నేతలు, ప్రజలు

- మంత్రి దయాకర్‌రావు

పాలకుర్తి : ఐక్యంగా ఉన్న గిరిజనుల మధ్య చిచ్చు పెట్టేందుకే రేవంత్‌రెడ్డి కుట్రలు చేస్తూ వర్గీకరణ చేయాలని గిరిజనులను అయోమయానికి గురి చేస్తున్నాడని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు విమర్శించారు. శనివారం మండలంలోని పెద్దతండా బీ కిష్టాపురంతండా, నర్సింగాపురం తండా, మైలారం, బీఖ్యానాయక్ పెద్దతండా పంచాయతీల్లో పంచాయతీ భవనాల శంకుస్థాపనతో పాటు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ 24 గంటల ఉచిత విద్యుత్ రైతులకు అందిస్తుంటే టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేసేందుకు మూడు గంటల విద్యుత్ సరిపోతుందని రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ప్రజలను అమలు చేయని హామీలతో మోసం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లోకి వస్తుంటారన్నారు. కార్యక్రమంలో జిల్లా, మండల అధికారుల, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్‌ఎస్‌లోకి చేరిక

నియోజకవర్గంలో ప్రజలను కడుపులో పెట్టుకొని కాపాడుకుంటున్నా వారికి ఏ కష్టం వచ్చిన ఆదుకుంటానని మంత్రి అన్నారు. బీఆర్‌ఎస్‌తోనే సీఎం కేసీఆర్ తోనే యువతకు మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కొడకండ్ల మండలం ఏడునూతుల గ్రామానికి చెందిన కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు ఈరెంటి సాయి, ఆయనతో పాటు చెన్నబోయిన అనిల్, మహ్మద్‌పాషాతో కలిసి 500 మందితో కలిసి మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు.

ఐదు రోజులు మృత్యువుతో పోరాటం

- చికిత్స పొందుతున్న విద్యార్థిని మృతి

హసన్‌పర్తి : ప్రమాదవశాత్తు ఐదో అంతస్తు నుంచి కింద పడిన ఓ విద్యార్థిని ఐదు రోజుల పాటు మృత్యువుతో పోరాటం చేసింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. వివరాల్లోకి వెళ్లితే హసన్‌పర్తికి చెందిన లిక్కి శంకర్ నగరంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. అతనికి భార్య, కూతురు అక్షయ(13), కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం గొల్లపల్లి సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటున్నాడు. నగరంలోని వరంగల్ పబ్లిక్ స్కూల్‌లో అక్షయ 8వ తరగతి చదువుతోంది. ఈనెల 21న అపార్ట్‌మెంట్‌లోని ఐదో అంతస్తు నుంచి ప్రమాదవశాత్తు కిందపడింది. చికిత్స నిమిత్తం సమీపంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది.

అవయవాల దానం



అక్షయ (ఫైల్)

అక్షయ అవయవాలను దానం చేశారు. కిమ్స్ ఆస్పత్రి వైద్యసిబ్బంది నేత్రాలతో పాటు ఇతర అవయవాలను సేకరించారు.

అశ్రునయనాల మధ్య అంతిమయాత్ర

అశ్రునయనాల మధ్య అక్షయ అంతిమయాత్ర సాగింది. పార్థివదేహం ఇంటికి చేరుకున్న సమాచారం అందుకున్న పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు అక్షయ మృతదేహాన్ని చూసి కన్నీటి పర్యంతమయ్యారు. చదువులో తెలివి గల విద్యార్థినిగా ఉపాధ్యాయులు చెప్పుకొచ్చారు. అనంతరం హసన్‌పర్తిలో శ్మశాన వాటికలో అక్షయ అంత్యక్రియలు నిర్వహించారు.

సీటీఓ ఎన్‌జేసీ బాధ్యతల స్వీకరణ



శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న సీటీఓ నాయకులు

నయీంనగర్: వరంగల్ వాణిజ్య పన్నుల శాఖ నోడల్ జాయింట్ కమిషనర్‌గా వి.శ్రీనివాస్‌రెడ్డి తెలంగాణ రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయంలో శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ ఎన్‌జీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ.ముజాహిద్ హుస్సేన్, వరంగల్ డివిజన్ అధ్యక్షుడు కె.గోపి కిషోర్ ఆధ్వర్యంలో శ్రీనివాస్‌రెడ్డిని శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ముజాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని శ్రీనివాస్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.ప్రభాకర్, ప్రవీణ్‌కుమార్, శామ్యూల్, ముజీబ్, అజయ్, చంద్రశేఖర్, హబీబ్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.